సింహాద్రి నాధుని దర్శించుకున్న ఈస్ట్రాన్ నేవెల్ కమండెంట్

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారిని వీఏడిఎం రాజేష్ పెండర్కర్ పీవీఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ ఎమ్. ఈస్టర్న్ నెవల్ కమాండ్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఫ్లాగ్ ఆఫీసర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ పర్యవేక్షకులు జీవిఎస్కె.ప్రసాద్ స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకొని అంతరాలయం పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పర్యవేక్షకులు మరియు సీనియర్ సహాయకులు వి.సూర్యనారాయణ గారు శ్రీ స్వామి వారి దర్శనం కల్పించి స్వామి వారి శేష వస్త్రం జ్ఞాపిక ప్రసాదం అందజేశారు.

రెడ్ బుక్ రాజ్యాంగం పక్కనపెట్టి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఏయూ మెయిన్ గేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆందోళన

విశాలాంధ్ర - విశాఖపట్నం : రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఏఐఎస్ఎఫ్ నాయకులు హితవు పలికారు. ఈ మేరకు శనివారం ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు .నాగరాజు మాట్లాడుతూ గత ప్రతిపక్షంలో ఉన్నటువంటి ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని అలాగే యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడే విధంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేస్తామని పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలు కళా శాలలో అడ్మిషన్స్ పొందలేక ప్రైవేట్ కళాశాలలో చేరడం జరుగు తుందని వారికి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎన్డీఏ ప్రభుత్వం అధికారం లోకి వస్తే వారి సమస్యలు తీరతాయని భావించినప్పటికీ ప్రయోజనం లేదని తెలిపారు. అలాగే కామన్ పీజీ ఎంట్రన్స్ వల్ల వారు చదవాలనుకున్న యూనివర్సిటీలలో అడ్మిషన్ రాకపోవడంతో డ్రాప్ అవుట్ పెరిగే పరిస్థితి నెలకొందని దీని ద్వారా అనేకమంది పేద మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ వ్యవహారం అంతా యూనివర్సిటీ అండర్ లో జరిగేలా పూర్తి అధికారం ఉపకులపతికి ఇవ్వాలని తద్వారా విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని తద్వారా యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంట్రన్స్ ద్వారా వచ్చే ఫీజు కూడా యూనివర్సిటీ అభివృద్ధికి ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంధని తెలిపారు. మరి ముఖ్యంగా అమ్మాయిలు చదువు కొరకు ఇతర దూర ప్రాంతాలకి వెళ్ళలేక మధ్యలోనే చదువు ఆపేసే పరిస్థితులు నెలకొంటున్నాయని గతంలో కంటే ఇప్పుడు యూనివర్సిటీలలో అడ్మిషన్స్ చాలా వరకు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం విద్యాశాఖ మంత్రి ట్విట్టర్లో పోస్ట్ పెట్టడానికో లేదా రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారు తప్ప విద్యార్థుల యొక్క సమస్యలను పరిష్కారం చేయడంలో విఫలం చెందారన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహించే విధంగా ఈ చర్యలు ఉన్నాయని, తక్షణమే రాష్ట్రవ్యాప్త కామన్ పీజీ ఎంట్రన్స్ సెట్ రద్దుచేసి, యూనివర్సిటీ పరిధిలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పీ.శేఖర్, యూనివర్సిటీ కార్యదర్శి జే అభిషేక్, ఇతర ప్రతినిధులు హేమానంద్, నెహెమియ, శివ రాజ్, కంజీర, చింటూ, నూతన్, హరి, స్వాతి, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర - తగరపువలస : జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రేమకుమార్ పెద మంగమారి పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం అమలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి వారి సమాధానాలతో సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులను అభ్యసన సామర్థ్యాలను గురించి అడిగి తెలుసు కున్నారు. వచ్చే నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నించి సంతృప్తి వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం : కూటమి ప్రభుత్వం మద్దతతో పోటీ చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువరన్ గెలిపించాలంటూ ఏపీటీఎఫ్ నాయకులు శనివారం నాడు ప్రచారం చేపట్టారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు జి.గంగాధరుడు ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం చేసి చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనందపురం ఎల్.వి పాలెం, పొడుగు పాలెం. దుక్కవానిపాలెం ,గండి గుండం వేములవలస, సత్య కళ్యాణ్ అపార్ట్మెంట్, వెల్లంకి, బోని, ఎల్వి పాలెం, పొడుగు పాలెం, పెద్దిపాలెం బొడ్డపాలెం బోయిపాలెం ముకుందపురం, గోట్టిపల్లి, మామిడిలోవ, తదితర గ్రామాలలో ఇంటింటి వెళ్లి ఏపీటీఎఫ్ ఇతర ఉపాధ్యాయ సంఘాలు, కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

యూట్యూబర్ నానిని అరెస్టు చేయాలి

పోలీస్ కమిషనర్కి ఏఐవైఎఫ్ వినతి

విశాలాంధ్ర - విశాఖ : బెట్టింగ్ ఆప్ ను ప్రోమోట్ చేస్తున్న యూట్యూబర్, ఇన్ఫ్లుఎన్సర్స్ లోకల్ బాయ్ నాని, ఆయన భార్య ఇటీవల చేసిన వీడియో ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై రాంబాబు, జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు శనివారం విశాఖ నగర కమిషనర్ కి వినతి పత్రం, వీడియోని పొందుపరిచిన మెమోరీ కార్డును అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బెట్టింగ్ యాప్ లు, రమ్మీ ఇతర ఆర్థిక మోసాలు జరిగే యాప్ లను యూట్యూబర్లు సోషల్ మీడియా వేదికగా ప్రమోట్ చేస్తూ లక్షలాది మంది యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని ఏఐవైఎఫ్ నాయకులు తెలిపారు. బెట్టింగ్, రమ్మీల ద్వారా యువత ఆర్థికంగా మోసపోవటమే కాకుండా చాలా మంది యువకులు ఆత్మహత్యలు చేసుకోవడం ఎక్కడో ఒక చోట తరచూ జరగడం చూస్తున్నామని తెలిపారు. ఇటీవల యూ ట్యూబర్ (లోకల్ బాయ్ నాని) విశాఖ నగరానికి చెందిన యువకుడు బెట్టింగ్ యాప్ వల్ల ఎక్కువ డబ్బులు వస్తున్నాయని తన భార్యతో కలిసి ఒక వీడియోను చిత్రీకరించి యుట్యూబ్, ఇన్ స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియాలో అప్ లోడ్ చేసాడు న్నారు. దీనిపై ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నా వారి అక్రమ సంపాదన కోసం ఇలా యువతను తప్పువ పట్టిస్తున్నారని విమర్శించారు. యూట్యూబర్ లోకల్ బాయ్ నాని, ఆయన భార్య, వీడియో చిత్రీకరించిన వారిని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం

20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : వైసిపి పాలనలో ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం అయ్యాయని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంక దినకర్ ఆరోపించారు. శనివారం బిజెపి నగర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 15 జిల్లాలో పర్యటించి జిల్లాల అధికారులతో వివిధ పథకాల అమలు పైన సమీక్ష నిర్వహించానన్నారు. 2019 - 24 మధ్య రాష్ట్రంలో జరిగిన అస్తవ్యస్థ విధ్వంస పాలన నుండి ఇప్పుడిప్పుడే బయటపడే ప్రయత్నం జరుగుతుందన్నారు. జగన్ పాలనలో ఉపాధి హామీ నిధులు వినియోగించు కోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. 2019 - 24 మధ్య మెటీరియల్ (ముఖ్యంగా సిమెంట్) కాంపోనెంట్ " సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ " ద్వార చేయడంలో భారీ అవినీతి ఉంది, అన్ని జిల్లాల సమీక్ష అనంతరం ఈ అంశం పైన పూర్తి స్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు. గత 5 సంవత్సరాలుగా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు పైన 30 ఏప్రిల్ 2025 నాటికి అన్ని జిల్లాల సమీక్షలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 24, 28 డిసెంబర్ 2024 లలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అధికారులతో సమీక్షించడం జరిగిందని చెప్పారు. సమీక్షలో అధికారులిచ్చిన సమాచారం మేరకు రెండు జిల్లాలో కలిపి 2019 - 24 మధ్య దాదాపు 2 వేల కోట్లు విలువైన మెటీరియల్ కపోనెంట్ ఎంటైటిల్మెంట్ వినియోగించుకోలేక పోవడం వల్ల నిధులు మురిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్న కొన్ని పత్రిక, మాధ్యమాలకు కనువిప్పు కలిగేలా వాస్తవాలు లెక్కలతో సహా ప్రజలకు తెలియ చేయాల్సిన భాద్యత మాకుందన్నారు.

ఏపీఈపీడీసీఎల్కు స్వానిటీ సాంకేతిక సహకారం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ లో అమలు చేస్తున్న పథకాలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని తీసుకొనేందుకు స్వానిటీ ఇనీషియేటివ్తో ఒప్పందం కుదుర్చుకొంది. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ ఎనర్జీ కన్సర్వేషన్ విభాగం సీజీఎం జె.శ్రీనివాస రావు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ బట్టాచార్య ఎంఓయూ పై సంతకాలు చేశారు. ఏపీఈపీడీసీఎల్లో అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికా కు చెందిన స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఓపెన్ యాక్సెస్ విధానం వలన ఈపీడీసీఎల్ ఆదాయంపై కలిగే ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేయడం, సంస్థ ఆర్థిక నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే కాకుండా విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనుంది.

దేశవ్యాప్త దళితుల దాడులపై నిరసన కార్యక్రమం

విశాలాంధ్ర - తగరపువలస : శనివారం తాళ్లవలస ఎస్సీ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దేశంలో గల వివిధ రాష్ట్రాలలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్నీ బాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగాన్ని కాపాడు కోవాలని దళితులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేసి అధ్యక్షత వహించిన బోని సన్ని బాబు మాట్లాడుతూ ఈమధ్య కోర్టులు ఇచ్చిన తీర్పులు దళితులకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు ముఖ్య అతిథి భాగం గోపాలరావు మాట్లాడుతూ దేశంలో టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో కుల వివక్షత అలాగే దళితులపై దాడులు అంతకుమించి జరుగుతున్నాయి అని ముఖ్యంగా ఈమధ్య మధ్యప్రదేశ్లో బావిలో మంచినీళ్లు త్రాగారని అగ్రవర్ణ కులస్తులు ఐదుగురు దళిత చిన్నారులను తాళ్లతో కట్టి కర్రలతో చావబాదారు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటలో గౌడ కులస్తురాలుని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని మాలబంటి అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారన్నారు తమిళనాడు రాష్ట్రం శివగంగై జిల్లా మాన మధురై గ్రామానికి చెందిన దళిత యువకుడు అయ్యా స్వామి బుల్లెట్ బండి నడిపాడని ముగ్గురు అగ్రవర్ణ యువకులు అసూయతో దారుణంగా రెండు చేతులను నరికి వేశారు మతోన్మాదులు రెచ్చిపోయి దళితులపై దాడులు హత్యలు అత్యాచారాలు చేస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి అన్నారు దేశంలో చూస్తుంటే దళితులను మరియొక 75 సంవత్సరాలు వెనక్కినట్టే కార్యక్రమం జరుగుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మాల మహానాడు అధ్యక్షులు మామిడి శివ అలాగే కొట్యాడ వీరకుమార్ సియ్యాద్రి రాంబాబు బోని ప్రసాద్ బోని శివ యాగాటి రామారావు బోణి హరిబాబు బోణి నర్సింగరావు సిద్దార్ద పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలకై ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - తగరపువలస : భీమిలికు చెందిన స్వర్ణంధ్ర ఇన్స్టిట్యూషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ మరియు మార్గ దర్శకత్వం శిక్షణ తరగతులను 24 తేది నుండి రాము హర్డ్వేర్ షాప్ సమీపంలో గల తమ కేంద్రంలో నిర్వహించ నున్నట్లు సొసైటీ నిర్వాహకులు తెలియజేశారు. అనుభవజ్ఞ పోటీ పరీక్ష నిపుణులు అందించే ఈ సేవా కార్యక్రమాన్ని వినియోగించు కోవాల్సిందిగా తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9052855580 మరియు 8790392777 ఫోన్ నెంబర్లను సంప్రదించ వలసిందిగా పత్రికా ముఖంగా తెలియజేశారు.

పరీక్షలకు ముందుగా విద్యార్థులకు విలువైన సూచనలు

విశాలాంధ్ర - తగరపువలస : భీమునిపట్నం మండలం గొల్లల పాలెం లో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంను సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె. చంద్ర శేఖర్ రావు ఆకస్మిక తనిఖీ చేసి 6,8,10 మరియు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా? ఇంకేమైనా కావాలా? అని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులు పరీక్షలకు మంచిగా, ప్రణాళికాయుతంగా చదవాలని , ఏమాత్రం ఒత్తిడికి గురి కాకుండా, పరీక్షల భయం లేకుండా, ఆరోగ్యాన్ని మంచిగా చూసుకుంటూ చదవాలి. అందరూ తప్పకుండా మంచి ఫలితాలు సాధించాలి అని ప్రోత్సాహకరంగా మాట్లాడుతూ , విలువైన సందేశం అందించారు.

ఎ.పి.ఎం.ఇ.ఎస్.ఎ విశాఖ జీవీఎంసీ ప్రధాన కార్యదర్శిగా ఇరుసుమళ్ల అప్పలరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జీవీఎంసీ విభాగానికి ప్రధాన కార్యదర్శిగా జీవీఎంసీ ఇన్చార్జ్ క్రీడా సంచాలకులు (స్పోర్ట్స్ డైరెక్టర్) ఇరుసుమళ్ళ అప్పలరాజును జివిఎంసి ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎ.పి.ఎం.ఇ.ఎస్.ఎ జీవీఎంసీ రాష్ట్ర కోశాధికారి ఎం.రవి శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఫిబ్రవరి 21 శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జివిఎంసి కార్యవర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రధాన కార్యదర్శిగా ఇరుసుమళ్ళ అప్పలరాజును ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జెమ్స్ అధ్యక్షులు అప్పలనాయుడు, జీవీఎంసీ అసోసియేట్ ప్రెసిడెంట్ వి.సన్యాసిరావు (సన్నీ) తో కలిపిన త్రిసభ్య కమిటీ, జీవీఎంసీ ఉద్యోగులు, ఈసీ సభ్యులతో అలాగే రాష్ట్ర కోశాధికారి రవి, కార్యదర్శి రాజేష్ సమక్షంలో ఈ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అమరావతి చైర్మన్ శ్రీ బొప్పరాజు వెంకటేశ్వర్లు ను అపహాస్యం చేసి ఉద్యోగులను, రాష్ట్ర నాయకులను కించపరిచిన బిర్లంగి శంకర్ ను ప్రధాన కార్యదర్శి హెూదా నుండి తొలగించిన కారణంగా "వి"శాఖ ప్రధాన కార్యదర్శి హెూదా ఎంపిక తేది: 21-02-2025 శుక్రవారం విశాఖ ప్రత్యేక సమావేశము నిర్వహించి ఆ స్థానంలో జీవీఎంసీ ఇన్చార్జ్ క్రీడా సంచాలకులు ఇరుసుమళ్ళ అప్పలరాజును ఎంపిక చేయడం జరిగినదని, జివిఎంసి రాష్ట్ర కోశాధికారి ఎమ్.రవి తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఇన్చార్జ్ క్రీడా సంచాలకులు అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో తన బాధ్యతను నిర్వర్తిస్తానని, జీవీఎంసీలో అన్ని క్యాడర్ల ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ నాయకులతో శక్తి వంచన లేకుండా పని చేస్తానని, అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జివిఎంసి విభాగానికి ప్రధాన కార్యదర్శిగా తనను ఎంపిక చేసిన తన తోటి ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జీవీఎంసీ రాష్ట్ర నాయకులు, ఈసీ సభ్యులు, మినిస్ట్రియల్ జీవీఎంసీ సంఘాల ప్రతినిధులు, మహిళా సభ్యులు, టాక్స్ కలెక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, దఫేదార్లు, డైవర్లు,పిహెచ్ మేస్త్రిలు, పిహెచ్ వర్కర్లు, మజ్దూర్లు తదితరులు హాజరయ్యారు.

ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి కార్యక్రమం

విశాలాంధ్ర - తగరపువలస : భీమునిపట్నం మండలం రెండవ వార్డు మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాశాఖ మరియు ఐసిడిఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి ఎఫ్ ఎలన్ 120 రోజుల జ్ఞానజ్యోతి 6 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్.జె. చంద్రశేఖర్ రావు సందర్శించి శిక్షణా జరుగుతున్న విధానాన్ని పరిశీలించి అంగన్వాడీ కార్యకర్తలు తో కొంతసేపు సమావేశం అయి వారికి తగిన సూచనలను ఇవ్వడం జరిగింది .అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణా కార్యక్రమం లో నేర్చుకున్న అంశాలు అన్నింటినీ వారి కేంద్రాలలో పిల్లలకు బోధించి పిల్లల యొక్క సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని ఎం.శివరాణి, ఎస్ఆర్పిలు బి.హరిణి కె.సన్యాసి నాయుడు, డిఆర్పీలు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ళజోళ్ల పంపిణీ

విశాలాంధ్ర - తగరపువలస : తాటితూరు జడ్పీహెచ్ హైస్కూల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు. హెడేక్ సైట్ ఉన్నటువంటి విద్యార్థులకు తనిఖీ చేసి తాటితూరులో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు జడ్పీహెచ్ హైస్కూల్లో ప్రధాన ఉపాధ్యాయులు మరియు చైర్మన్ సమక్షంలో 23 మంది పిల్లలకు కళ్ళజోళ్ళు పంపిణీ చేసారు. ఇంత మంచి కార్యక్రమం చేసిన ప్రాథమిక ఆరోగ్య శాఖ ఏఎన్ఎం మరియు డాక్టర్కి ఆరోగ్యశాఖ స్టాప్ అందరికీ కూడా స్కూలు ఉపాధ్యాయుల తరపున మరియు పిల్లల తల్లిదండ్రుల తరఫున స్కూల్ ఎస్ఎంసి సభ్యుల తరఫున ధన్యవాదాలు తెలియజేసారు.

కోలాహలంగా ట్విన్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : నగరంలోని దాబా గార్డెన్స్లో ఒక హెూటల్లో శనివారం ట్విన్స్ డే వేడుకలు కోలాహలంగా జరిగాయి. వేడుకలలో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న సుమారు 50కి పైగా కవలలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకే రూ పంతో ఇద్దరు మనుషులు ఉండడం, ఒకసారి ఇంతమంది కవల లును చూడటం చాలా సంతోషంగా వుందని అన్నారు. కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేసిన విశాఖపట్నం చెందిన రామ్ లక్ష్మణ్, సోంపేటకు చెందిన రామరాజు లక్ష్మరాజు ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత ఆలోచనలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, త్రివేణి, సునీల్, రామకృష్ణ, అధిక సంఖ్యలో కవలలు పాల్గొన్నారు.

గ్రీన్ విశాఖ మెషీన్ లక్ష్యం 1 మిలియన్ ప్లాంటేషన్

విశాఖ పోర్టు, జిల్లా యాంత్రాంగం సంయుక్త కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : స్వచ్ఛతా కాంపెయిన్ 4.0, స్వచ్ఛతాహీ సేవా 2024లో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో మేగా ప్లాంటేషన్ డ్రైవ్ ను విశాఖపట్నం పోర్టు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో పలు చోట్ల నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణలో స్థానికులను భాగస్వాములుగా చేస్తూ పోర్టు ఈ కార్యక్రమాలను చేపట్టింది. వచ్చే మూడేళ్లలో 1 మిలియన్ మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో భాగస్వాములు కావాలని పోర్టు యాజమాన్యం జిల్లా యంత్రాంగాన్ని కోరుతూ విశాఖ జిల్లా కలెక్టర్ కు జనవరి 22, 2025న లేఖ రాసింది. పోర్టు పిలుపునకు విశాఖ జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించారు. పర్యావరణ పరిరక్షణకు బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన పోర్టు యాజమాన్యాన్ని అభినందిస్తూ జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కలెక్టర్ ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా గ్రీన్ విశాఖ మిషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. గ్రీన్ విశాఖ మిషన్ను ముందుకు తీసుకువెళ్లేందుకు కార్యచరణను రూపొందించారు. ఇందులో భాగంగా నగరంలో ఉన్న అన్ని ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోస్, స్కూల్స్, కాలేజీలను భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రీన్ విశాఖ మిషన్ ను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను చర్చించేందుకు అన్ని విభాగాలతో ప్రతి గురువారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి సమావేశాన్ని ఫిబ్రవరి 13 రెండో సమావేశాన్ని ఫిబ్రవరి 20న నిర్వహించారు. ఈ మొక్కల నిర్వహణను పర్యవేక్షించే బాధ్యతను జిల్లా నీటి నిర్వహణ ఏజెన్సీకి అప్పగించారు. గ్రీన్ విశాఖ మిషన్ లో భాగంగా 1 మిలియన్ ప్లాంటేషన్ ను చేపట్టనున్నారు. తొలి విడతలో ఈ మార్చ్ నాటికి 3.5 లక్షల మొక్కలను పోర్టు సిద్ధం చేయనుంది. ఈ మొక్కలను నగరంలోని జీవీఎంసి, విఎంఆర్డీఏ, అటవీశాఖ, వివిధ పరిశ్రమలు, స్కూల్స్ కాలేజీలు, ఎన్జీవోలు మరియు ఇతరులకు వారి అవసరాల మేరకు అందించనున్నారు. తదుపరి వచ్చే సంవత్సరం మరో 3.5 లక్షల మొక్కలను పోర్టు అందించనుంది. సంస్థల అవసరాలకు అనుగుణంగా ఈ మొక్కలను వారివారి పరిధిలో నాటుకోవాల్సి ఉంటుంది. ఇక చివరి విడతను 2026.27 ఏడాదికి సిద్ధంచేసి అందించనున్నారు. దీంతో వచ్చే మూడేళ్లలో విశాఖపట్నం పోర్టు జిల్లా యాంత్రాంగం సంయుక్తంగా గ్రీన్ విశాఖ మిషన్ ను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 1 మిలియన్ ప్లాంటేషన్ లో భాగంగా విశాఖపట్నం పోర్టు ఏజెన్సీలోని పలు పాఠశాలలో 21 వేల మొక్కలు నగరంలో మరియు చుట్టు పక్కల ప్రాంతాల్లో వివిధ ఎన్జీవోలతో కలిపి ఇప్పటికే 50 వేల మొక్కలు నాటే ప్రక్రియను పూర్తిచేసింది. ప్లాంటేషన్ లో భాగంగా మామిడి, సపోట, కస్టర్డ్ ఆపిల్, కొబ్బరి, చింత వంటి పండ్ల రకాలు, వేప, బాదాం, కదంబ, డెలోనిక్స్, మహాగని వంటి అటవీ జాతులను అందిస్తున్నారు. ప్రతి గురువారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీన్ విశాఖ మిషన్ పై వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, విభాగాల అధికారులు, పరిశ్రమల ప్రతనిధులు, ఎన్జీవోలతో సమీక్షను నిర్వహించి ప్లాంటేషన్ తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించనున్నారు. విశాఖపట్నం పోర్టు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా ముందుకు తీసుకువెళ్లడంలో విశాఖ జిల్లా యాంత్రాంగం కీలకంగా వ్యవహరిస్తోంది.

మాస్టర్ ప్లాన్ రహదారులకు ఆర్డిపిలు సిద్ధం చేయండి

వీఎంఆర్డీఏ ఎంసీ విశ్వనాథన్



విశాలాంధ్ర - విశాఖ : బృహత్ ప్రణాళిక రహ దారులకు సంబం ధించిన రహదారి అభివృద్ధి ప్రణాళికలను (ఆర్డిపి) వారాంతానికల్లా సిద్ధం చేయాలని వీఎంఆర్డీఏ ఎంసీ కెఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. ఆయన శనివారం ప్రణాళికా విభాగం సమీక్ష నిర్వహించారు. ప్రణాళికా విభాగానికి సంబంధించిన న్యాయపరమైన కేసులు సత్వరమే పరిష్కా రమయ్యే విధముగా చర్యలు తీసుకోవాలని సూ చించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి గరివిడి, అద్దూరు ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ స్థలాలు ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారులు వేంకటేశ్వర రావు, చామంతి, మౌనిక ప్రణాళిక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్ కార్యాలయం కానూరు విజయవాడలో
(విశాఖపట్నం వినియోగదారుల ఫారమ్ విశాఖపట్నం వారి ఫైలు)
FA.No 608/2024 in CC No. 4/2023
Between
స్టేట్బ్యాంక్ ఆఫ్ ఇండియా
రిప్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్
ప్రహ్లాదపురం విశాఖపట్నం.... అప్పిలెంటు/2వ అపోజిట్ పార్టీ
మరియు
శ్రీ వడ్డీ కిరణ్ చంద్ వగైరా... రెస్పాండెంట్స్ ఆర్1 (1వ అపోజిట్ పార్టీ)
వడ్డీ కిరణ్ చంద్ S/o విజయరత్నం
D.No 2-20 నియర్ ఎస్.టి పీటర్స్ చర్చ్
శెతీన్పేట, భీమునిపట్నం, విశాఖపట్నం
పై నెంబర్ FA లో R1 అయిన మీకు పై స్టేట్ కమిషన్/శ్రీకోర్టు ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను నోటీసులు మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసిందిగా పై కోర్టు / స్టేట్ కమిషన్ వారు ఆర్డరు వేస్తూ ది.12.03.2025కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం,,10.30ని.లకు మీరు స్వయముగా గాని లేక మీ అడ్వకేట్ ద్వారా గాని పై కమిషన్ వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు అప్పీలును మీ పరోక్ష యందు విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
ఎమ్.ఎస్ ఖాలీద్ (B.com, B.L), అడ్వకేట్
54-18-39 రోడ్డు నెం.1, రేడియో కాలనీ
ఐటీఐ కాలేజీ రోడ్డు, విజయవాడ -520008
ఫోన్ : 9392111319

మిల్లీనియం డ్రైవ్ ద్వారా 25 మంది విద్యార్థులకు ప్లేస్మెంట్

విశాలాంధ్ర - విశాఖపట్నం : "మిల్లీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, ద్వారకనగర్‌లో శనివారం నాడు నిర్వహించిన కాంపస్ డ్రైవ్ ద్వారా 25 మంది విద్యార్థులు ప్లేస్మెంట్ కి ఎంపికయ్యారు" అని మిల్లీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ చెప్పారు. అప్లికేషన్ డెవలప్మెంట్ %డ% డిప్లాయ్మెంట్ టెక్నాలజీలో ప్రముఖ కంపెనీలలో ఒకటైన యలమంచిలి సాఫ్ట్వేర్ ఎక్స్పోర్ట్స్, విశాఖపట్నంతో దేవోప్స్లాస్ ఇంజనీర్, సాఫ్ట్వేర్ డెవలపర్ సిస్టమ్ ఇంజనీర్ వంటి బహుళ ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. " సి, పైథాన్, ఎడబ్ల్యుఎస్, డివోప్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, సిసిఎన్ఎ, సిసిఎన్పి మరియు హార్డ్వేర్ నాలెడ్జ్ లలో మంచి నైపుణ్యం కలిగిన సుమారు 275 బి.టెక్ ఫ్రెషర్లు/గ్రాడ్యుయేట్లు క్యాంపస్ డ్రైవ్ లో పాల్గొనగా, 25 మంది అభ్యర్థులను ప్లేస్మెంట్కు ఎంపిక చేశారు "అని సెంట్రల్ మేనేజర్ తెలిపారు. 18 జనవరి న మిల్లీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, భర్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం తో నిర్వహించిన కాంపస్ డ్రైవ్ లో 35 మంది సీ ఎస్ ఈ విద్యార్థులు ప్లేస్మెంట్ను సాధించారు అని ఆయన గుర్తుచేశారు.

ఈ కాంపస్ డ్రైవ్ లు జాబ్ ఫెయిర్ లు ప్రతి నెలా ప్రముఖ కంపెనీలతో నిర్వహిస్తామని ఆయన తెలిపారు."మిల్లీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ మార్కెట్లో ప్రస్తుత ట్రెండ్గా ఉన్న కోర్సులను అందించడం మీద దృష్టి పెడుతుంది" అని ఆయన వెల్లడించారు. మిలీనియం డేటా సైన్స్, ఎడబ్ల్యుఎస్, డెవొఆప్స్ మరియు ఫుల్ స్టాక్స్ వంటి మార్కెట్లో అధిక డిమాండ్ కలిగి ఉన్న ట్రెండింగ్ కోర్సులను పరిశ్రమలో గొప్ప అనుభవజ్ఞులైన అధ్యాపకులు ద్వారా అందిస్తోందన్నారు."తదుపరి కాంపస్ డ్రైవ్ మార్చి నెల తొలి వారంలో నిర్వహించబడుతుంది" అని హెచ్ ఆర్ మేనేజర్ దివ్య జ్యోతి బి అన్నారు. యలమంచిలి సాఫ్ట్వేర్ ఎక్స్పోర్ట్స్, విశాఖపట్నంలో మంచి కెరీర్ అవకాశాలను కలిగి ఉన్న ప్రముఖ ఐటీ బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్" అని హెచ్‌ఆర్ రిక్రూటర్ ప్రిస్సీ ప్రిస్సిల్లా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సాఫ్ట్వేర్ ఎక్స్పోర్ట్స్ నుండి హెచ్ ర్ అసిస్టెంట్ హరీష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ వత్సల్య సాయి, మిల్లీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ నుండి హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ జి. సాగర్ ఇతరులు కాంపస్ డ్రైవ్ లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు... హాస్పటల్‌కి తరలింపు

విశాలాంధ్ర - ఆనందపురం :మండలంలోని గిడిజాల వైయస్సార్ కాలనీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరుకు తీవ్ర గాయాలు కాగా, భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందపురం మండలం, ఆనందపురం పంచాయితీ పొడుగు పాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి .లక్ష్మణరావు(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు లోకి వెళితే బంటుపల్లి లక్ష్మణరావు, భార్య గౌరీ వరలక్ష్మి వేమగోట్టిపాలెం లో బంధువుల మృతి చెందితే చూడడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు వస్తుండగా ప్రయాణంలోఆనందపురం వస్తుండగా విజయనగరం నుండి సింహాచలం వైపు వస్తున్న కారు గిడిజాల వైయస్సార్ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్నబైకును బలంగా ఢీకొంది, ఈ ఘటనలో బైకు నిజ్జు,నుజ్జు అయి లక్ష్మణరావు కారు అద్దం పై పడగా అతని భార్య గౌరీ వరలక్ష్మి రోడ్డుపై పడడంతో కారు ఆమె రెండు కాళ్లపై కారు చక్రాల వెళ్లిపోవడంతో కాలు చేతులు విరిగిపోయాయి.క్షతగాత్రులు నువి" పినాకిల్ హాస్పిటల్ "కి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో లక్ష్మణరావు మృతిచెందారు అతని భార్య గౌరీ వరలక్ష్మి తీవ్ర గాయాలతో విషమ పరిస్థితి ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా వాహనం నడపడం వలనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

విషాదంలో పొడుగుపాలెం గ్రామస్తులు...

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ తీవ్ర గాయాల లక్ష్మణరావు మృతి చెందడం, గౌరీ వరలక్ష్మి కు రెండు కాళ్లు విరిగిపోవడంతో కుమార్తె సాయి (13) కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విశాఖపట్నం పినాకిల్ ఆస్పత్రికి చేరుకొని రోదించారు. లక్ష్మణరావు గౌరీ వరలక్ష్మి ఒక్కసంతానం అయినా సాయి ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నది

తండ్రి మరణించడం తల్లి విషమ పరిస్థితిలో ఉండడం, ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పలాస : దశాబ్దాల కాలంగా అసంపూర్తిగా ఉన్న తమ సమస్యలు పరిష్కారం చేయాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్ ఎన్.రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎన్ గణపతి మాట్లాడుతూ పని ఒత్తిడితో పాటు, విధుల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ సేవలు అందించడం లో ఆటంకం కలిగించలేదనే విషయాన్ని గుర్తించాలని కోరారు. గత కొన్ని సంవత్సరాలనుండి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని,దీనివల్ల మున్సిపల్ పరిధిలో పనిచేయడం కూడా కష్టం అవుతుందన్నారు. కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కమిషనర్ గా వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాది కల్పించాలని, విధులు నిర్వహిస్తున్న కార్మికులు కు పని ముట్లు ఇవ్వాలని, పాడైనా తోపుడు బండ్లు రిపేరు చెయ్యాలని కోరారు. మున్సిపాలిటీలో తగిన శానిటేషన్ వర్కర్స్ ను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న పి యఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలలో జమ చేయాలని, ఆప్ కాస్ రద్దు నేపథ్యంలో కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని, పని కాంట్రాక్టు కు ఇవ్వాలనే ఆలోచన విరమించాలని, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇచ్చిన జి ఓ ప్రకారం పండగ బోనస్ వెయ్యి రూపాయలు చెల్లించాలని,కార్మికులు చనిపోయిన సందర్భంలో దహనసంస్కారం ఖర్చులు ఇప్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. దీనిపై సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని తదితర డిమాండ్లు కమిషనర్ ముందుంచారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో యూనియన్ ప్రతినిధులు సిహెచ్ మురగన్, కె.వెంకటి, బి.కుర్మారావు లు తెలిపారు. యంరవి, తిరుపతి, బాలక్రిష్ణ, కె ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తండ్యాంలో ఇంటింటా చెత్త సేకరణ

విశాలాంధ్ర - పొందూరు : పొందూరు మండలం తండ్యాం గ్రామంలో సర్పంచ్ కిల్లారి అప్పలనారాయణమ్మ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శంకర్రావు, పారిశుద్ధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో దర్యాప్తు మరింత పటిష్టవంతంగా ఉండాలి

డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాల కేసులో నేరస్తులకు శిక్షపడేలా దర్యాప్తు పటిష్టవంతంగా నిర్వహిం చాలని విశాఖ రేంజీ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో శ్రీకాకుళం, విజయ నగరం, పార్వతీపురం మూడు జిల్లాల పోలీసు అధికారులతో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాపులో నిబంధనలు, నియమాలు, నైపుణ్యంపై శనివారం నిర్వహించిన వర్క్షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన అంశంగా తీసుకుందన్నారు. గంజాయి రవాణా, వ్యాపారుల మూలాలను తెలుసుకుని, కేసుల నమోదు, దర్యాప్తు విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేంజి పరిధిలోని ఐదు జిల్లాల్లో ఇప్పటి వరకు ఎస్ఐ నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు 320 మంది పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. శిక్షలు పడినప్పుడే గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టగలమన్నారు. గంజాయి కేసుల్లో దర్యాప్తునకు నైపుణ్యమే కీలకమన్నారు. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్, అప్పీలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రం గధామ్ మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చట్టపరమైన అంశాలు, దర్యాప్త ప్రక్రియలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల కేసులో చట్ట ప్రకారం నియమ, నిబంధనలు పాటిస్తూ దర్యాప్తు పూర్తిచేయాలన్నారు. కేసుల దర్యాప్తులో న్యాయ సలహాదారులను, నిపుణుల సూచనలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అదనపు ఎస్పీలు కేవీ రమణ, అంకిత స రాన, డీఎస్పీలు వీవీ అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో 'స్మార్ట్' ప్రాబ్లం

చార్జింగ్ పూర్తి కావడంతో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

ఆగ్రహించిన తహశీల్దార్

విశాలాంధ్ర - సోంపేట : ఏపీఈఈడీసీఎల్ వినూత్న విద్యుత్ సేవల్లో భాగంగా గతంలో అమర్చిన సాధారణ మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లును ఏర్పాటు చేస్తున్న సంగతి తెల్సిందే. స్మార్ట్ మీటర్లు ముందుగానే రీచార్జ్ చేసుకుని విద్యుత్‌ను వినియోగించుకోవల్సి ఉంటుంది. ఈ విధానాన్ని మేధావులు, అనేక ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెల్సిందే. మొబైల్ రీచార్జ్ మాదిరిగా ఇంటిలోను, కార్యాలయాల్లో వాడుకునే విద్యుత్ సరఫరా విషయంలోను స్మార్ట్ మీటర్లుకు ముందుగానే ఆన్‌లైన్ విధానంలో విద్యుత్ బిల్లు అడ్వాన్స్‌గా చెల్లించాల్సిన అవసరం ఉంది. సోంపేట తహశీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కార్యాలయ పనుల్లో చాలా బిజీగా ఉన్న సిబ్బంది పనులన్ని ఒక్కసారిగానిలిచిపోయాయి. తీరా చూసేసరికి అడ్వాన్సుగా రీచార్జ్ చేయాలన్న విషయం అందరూ మర్చిపోయారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.అప్పలస్వామి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ప్రభుత్వ కార్యాలయంలో అడ్వాన్సుగా బిల్లు చెల్లించడానికి ఏ విధంగా చెల్లించాలి అన్న మార్గదర్శకాలు కూడా లేకపోవడం గమనార్హం. ఇటీవల జరిగిన గ్రామసభలో రైతుల నుంచి వచ్చిన రీసర్వే ఫిర్యాదులను పరిష్కారం చేయడంలో అధికారులు, సిబ్బంది ఆహర్నిశలు శ్రమిస్తున్న విషయం తెల్సిందే. ఇదే సమయంలో రాత్రి వేళ

ఆకస్మాత్తుగా కరెంట్ సరఫరా నిలిచిపోవడం తీవ్ర ఇబ్బందికి గురి చేసి ఒక్కసారిగా స్మార్ట్ మీటర్ అందరి కళ్లు తెరిపించింది.

8 లక్షలు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా

తహశీల్దార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరా పునరుద్దరించాలంటే ఈ కార్యాలయం బకాయి పడిన అక్షరాల 8లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఇంత భారీ మొత్తం బకాయి చెల్లించడం ఇప్పట్లో అయిన పని కాదు. సరఫరా నిలిచిపోయిన వెంటనే స్థానిక విద్యుత్ సిబ్బంది పిలిపించి రెవెన్యూ అధికారులు మాట్లాడడంతో పాత బకాయి 8లక్షలు చెల్లించాలని చల్లగా చెప్పడంతో ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయంలో గందరగోళం నెలకొంది.ఏమి చేయాలో, ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురైంది. ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్దరణకు తహశీల్దార్ అప్పలస్వామి కృషి చేస్తున్నారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా బ్లూమ్ అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు పి.తారకేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ " అమృతం దొరికితే త్రాగే వారు ఆ దేవతలు కానీ అదే అమృతం దొరికితే బిడ్డలకు పంచి ఇచ్చేవాళ్లే తల్లిదండ్రులని కొనియాడారు. తమ ఉద్యోగాల్లో తీరిక లేకుండా ఉండటం వల్ల పిల్లలకు తమకు మధ్య ఉన్న అనుబంధాలు తగ్గుతున్నాయని, దానిని తెలియ చెప్పడంలో భాగంగా శ్రీ చైతన్య యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలాంటివి నిర్వహించడం వల్ల పిల్లలకు పెద్దలను ఎలా గౌరవించాలో వారి పట్ల ఎలా ప్రవర్తించాలో తెలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉత్తరాంధ్ర పాఠశాలల ఏ జీ ఎం ఎం వి సురేష్, పాఠశాలల రీజినల్ ఇంచార్జ్ అహమ్మద్ అలీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎస్ వి గోవిందరావు, సి బ్యాచ్ ఇంచార్జ్ ఎం ఆర్ వి శేషగిరి, అసిస్టెంట్ డీన్ హఫసా ఇతర ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే గేట్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని అంపురం రైల్వే ఎల్సి గేట్ వద్ద వున్న రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని సోంపేట సెక్షన్ పర్మినెంట్ వే ఇన్స్పెక్టర్ వారికి జెడ్ ఆర్ యుసిసి సభ్యులు శ్రీనివాస రౌలో వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అంపురం ఎల్సి గేట్ వద్ద రైల్వే ఇంజనీర్లు ట్రాక్ మరమ్మతులు చేపట్టడం వల్ల ఎల్సి గేట్ మధ్య ఎత్తు బాగా పెరిగిపోవడం జరిగిందని దీంతో ఎమ్మెస్ పల్లి వైపు వెళ్లే సుమారు 50 గ్రామాల ప్రజలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

జాతీయ స్థాయి యంగ్ ఇండియా కె బోల్ సీజన్ -5 పోటీలకు కిరణ్ కుమార్

విశాలాంధ్ర - కవిటి : విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న యంగ్ ఇండియా కే బోల్ సీజన్ -5 రాష్ట్ర స్థాయి వకృత్వం పోటీల్లో రన్నర్గా నిలిచి ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రూ. 7,500 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పూడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలించాలని, భారత రాజ్యాంగం సక్రమంగా అమలు చేయాలని అన్నారు. ఈ బహుమతిని పానెల్ సభ్యులు రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి పీవీ బాల కోటేశ్వరరావు, ఏపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మస్తాన్ వలీ, సీనియర్ జర్నలిస్టు షేక్ బాబు,యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రటరీ మమత నాగి రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు,యంగ్ ఇండియా కే బోల్ అబ్జర్వర్ నికితారావు, యంగ్ ఇండియా కే బోల్ ఐవైటిసీ రాష్ట్ర ఇన్చార్జి రాజ్కుమార్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించుకుందాం

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జి ఎన్డీఏ శ్రేణులకు పిలుపునిచ్చారు. జివిఎంసి 95 వార్డు సుజాతనగర్ మెయిన్ రోడ్డు ఆర్కే ఫంక్షన్ హాల్‌లో బీజేపీ టీడీపీ ముఖ్య నాయకులతో శనివారం ఉదయం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27 న జరగనున్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పాకలపాటి రాఘువర్మకు మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటును జిల్లాలోని ఉపాధ్యాయులందరి చేత వేయించేలా నాయకులు కార్యకర్తలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికార పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలిస్తే ఉపాధ్యాయుల సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎదుర్కొన్న కష్టాలను వారికి గుర్తు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి విజన్‌తో పాలన చేస్తున్నారని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజవర్గం ఎమ్మెల్సీ ఎలక్షన్స్ పరిశీలకులు లక్ష్మణరావు, జయలక్ష్మి , తెలుగుదేశం పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, సేనాపతి శంకర్రావు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు,94 వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దాపు శ్రీనివాసరావు, కర్రి కనకరాజు, కొరుపోలు రామనాయుడు, కరక దేవుడు, జీవీఎంసీ 88 వార్డు అధ్యక్షులు ఒబ్బిన శ్రీకాంత్, పిన్నింటి పార్వతి, ఆది బాబు, మజ్జి సూరిబాబు, కంచిపాటి మధు, దాట్ల మధు, డిబిఎల్ నాయుడు, ఆవగడ్డ అప్పల నాయుడు, సీనియర్ నాయకులు బర్ని ఖానా బాబురావు, రెడ్డి నారాయణరావు గారు, డొల్ల రామానాయుడు, ఇందల రమణ, సుఖవాసి బుజ్జి, అయితి సింహాచలం నాయుడు, బలిరెడ్డి అప్పారావు, వేగి దివాకర్, చింతకాయల ముత్యాలు టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు

ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉధృతంగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - తగరపువలస : ఫిబ్రవరి 27వ తేదీన జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో గాదె శ్రీనివాసులు నాయుడుకి పి.ఆర్.టి.యుతో కలసి మద్దతు ప్రకటించిన ఎస్.టి.యు, ఆపస్, ఏపీటీఎఫ్ 1938 సంఘాలతో కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని శుక్రవారం సాయంత్రం చిల్లపేట నుండి భీమునిపట్నం వరకు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజల మనిషిగా ఉపాధ్యాయులలో మంచి పేరు ఉన్న వ్యక్తిగా కీర్తిని ఆశించిన అజాతశత్రువు గాదె శ్రీనివాసులు నాయుడుకి పూర్వ అనుభవంతో పాటు ప్రస్తుత ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తిగా మంచి పేరు ఉందని చెబుతున్నారు. నిగర్వి, నిరంతరం సమస్యలపై పోరాడే వ్యక్తిగా ఉపాధ్యాయ పక్షపాతిగా అలుపెరుగని యోధుడిగా గాదె శ్రీనివాసులు నాయుడుకి మంచి గుర్తింపు ఉందని గోపీనాథ్, ఇమంది పైడిరాజు, సిహెచ్. స్వామి,మడ్డు శ్రీను, నాగేశ్వరరావు, పొట్నూరు మురళీమోహన రావు, ఎస్.కృష్ణారావు,, కరుణాకర్, ఇమంది వెంకట్రావు, ఆల్తి రామకృష్ణ దళిత నాయకులు తమ మాటల్లో తెలియజేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించడం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని గరికిన పరదేశి తెలియజేశారు. నిష్పక్షపాతిగా, సమర్థవంతుడిగా బాధ్యతలు నిర్వహిస్తారని మద్దతుదారులు హేమ సుందర్, కె.సన్యాసినాయుడు, భాస్కర్, రమణారావు, రొంగలి అప్పారావు, నయీమ్ తెలియజేశారు. చాలామంది ప్రధానోపాధ్యాయులు తమ మద్దతుని ప్రకటించారని తెలియజేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి అధిక మెజారిటీనివ్వాలి

భీమిలి పార్టీ శ్రేణులకు గంటా రవితేజ పిలుపు

విశాలాంధ్ర - తగరపువలస : పార్టీకి కంచు కోటైన భీమిలి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు అధిక మెజారిటీ అందివ్వాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. ఈనెల 27 న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహరచన కోసం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయం లో శనివారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి టీడీపీ అంటే పార్టీ కార్యక్రమాల అమలులో ముందుంటుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 92,401 ఓట్ల మెజారిటీ సాధించడానికి, ఇటీవలి సభ్యత్వాల నమోదులో లక్ష మార్కు దాటడానికి కార్యకర్తల కృషి, పట్టుదల ప్రధాన కారణమని ప్రశంసించారు. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో హైస్కూల్స్ లో విస్తృత ప్రచారం చేపట్టి ఓటర్లను నేరుగా కలుసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి రఘువర్మను ఈనెల 27 న జరిగే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అన్నపూర్ణేశ్వరరావు, భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, పార్టీ నాయకులు డి.ఎ.ఎన్.రాజు, అనీల్ ప్రసాద్, మొల్లి లక్ష్మణ్, ఎం.సోంబాబు, కొప్పల రమేష్, గొలగాని నరేంద్ర, పాసి త్రినాథ్, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డను కూడా వదలరా.? పట్టాభి రెడ్డి తోటలో కబ్జా ....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ నగరంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి ఒకవైపు పేదల పేరిట పెద్దలు గెద్దల మాదిరిగా ప్రభుత్వ స్థలాలను ఎత్తుకు పోతున్నారు. అదే సమయంలో పరిస్థితిని ఆసరగా తీసుకుని ఇతర వర్గాలు కూడా కబ్జాలకు పాల్పడుతున్నారు . నగరంలోని 49 వ వార్డు పట్టాభి రెడ్డి గార్డెన్స్ లో ఇప్పటికీ పెద్ద ఎత్తున కాలవలు కబ్జాకు గురయ్యాయి మురళి నగర్ ..బర్మా క్యాంప్ ప్రాంతాల నుంచి వచ్చే గెడ్డ ను ఇప్పటికే పెద్దలు మింగేసారు. దీంతో గడ్డ ప్రవాహ ప్రదేశం కుదించుకుపోయింది చిన్న వర్షాలకు కూడా రోడ్డుపైకి నీరు వచ్చేస్తోంది. ఈ దశలో పట్టాభి రెడ్డి గార్డెన్స్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద గెడ్డ ను ఆక్రమిస్తూ చాలా వరకు నిర్మాణాలు జరిగాయి .తాజాగా అనుమతులు లేని నిర్మాణం తో పాటు గెడ్డ ను మింగేస్తూ పార్కింగ్ నిర్మాణం జరుగుతుంది ఇప్పటికే ఉండాల్సిన కంటే తక్కువ వెడల్పుకు గెడ్డ చేరడంతో ప్రజలు వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు ఆ ప్రవాహ వేగానికి కొన్నిసార్లు మనుషులు కొట్టుకుపోయే పరిస్థితి కూడా ఏర్పడింది ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ గోడలను కూడా కొందరు మింగేశారు దీని వెనక రాజకీయ నాయకులతో పాటు గ్రామ పెద్దల హస్తాలు కూడా ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు తాజాగా నిర్మితమవుతున్న గెడ్డ ఆక్రమణను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

లక్కీ గోవింద్‌కు ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి : జనసేన పార్టీ ప్రచార కమిటీ మెంబర్ ఉరిటి లక్కి గోవింద్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సహా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే సమక్షంలో కేకు కత్తిరించి ఆయనకు అభిమానంగా తినిపించారు. ఈ సందర్భంగా లక్కి యువసేన టీం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు ఆటల పోటీలు, ఉదయం ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి లక్కి గోవింద్ పేరు మీద అర్చన చేయించారు. అనంతరం ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో బాలికలకుఅల్పాహారం అందజేశారు. పెందుర్తి గవర్నమెంట్ హాస్పిటల్ లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే దార లావ పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు కోటిబాని శ్రీను, తెలుగుదేశం నాయకులు నమ్మి అశోక్, నంబారు రాజేష్ ,బాదంపూడి కృష్ణ, జనసేన నాయకులు చీర రాజు, ఉరిటి శ్రీను, బమ్మిడి త్రినాథ్ , దాకారపు శ్రీను బొబ్బిలి శేఖర్, హర్షవర్ధన్, ప్రకాష్, పల్ల కళ్యాణ్, కృష్ణ, గోపాల్ సహా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లక్కి గోవింద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆముదాలవలస : నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లను సత్వరమే పరిష్కరిం చేందుకు ప్రజా దర్బార్ ఎంతగానో ఉపకరిస్తుందని స్థానిక శాసనసభ్యు లు, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎక్కువగా ఇల్లు రేషన్ కార్డులు పింఛన్లు కోసం దరఖాస్తులు వచ్చాయి. వాటిని వెను వెంటనే పరిష్కారానికి అధికారులకు అందజేశారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలు పై స్థానిక నాయకులు వినతి పత్రా లు అందించారు. కరోనా సమయంలో అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా రోగులకు వివిధ రకాల సేవ లు అందించిన వారిని గత ప్రభుత్వం తొలగించిం దని, 2021 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జీతా లు అందించలేదు అన్నారు. అంతేకాకుండా తొమ్మి ది నెలల పాటు పనిచేసిన కాలానికి జీతం ఇవ్వ లేదని పేర్కొంటూ పైడి రాజేశ్వరరావు, గొల్లపల్లి శ్రీదేవి, సిపాన రాంబాబు, సనపల సన్యాసి రావు లు వినతి పత్రం అందించారు. శ్రీకాకుళం, విజయ నగరం, ఈస్ట్ గోదావరి జిల్లాల అర్బన్ హెల్త్ సెంట ర్ లలో పనిచేసిన వారిని తొలగించారని మిగిలిన జిల్లాలలో నేటికీ కొనసాగిస్తున్నారని వివరించారు. బకాయి ఉన్న జీతాలతో పాటు మాకు ఉద్యోగం కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించా రు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సర్పం చులు ఎంపీటీసీలు వారి వారి ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం దిశగా ఎమ్మె ల్యే కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలతో పాటు పలు పథకాల కోసం లబ్ధిదారులు పాల్గొన్నారు.